క్లుప్తంగా

విలీన మండలాల కూలీలను ఆదుకోవాలి

కుక్కునూరు: గోదావరి వరదలు, భారీ వర్షాలతో అల్లాడుతున్న కుక్కునూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వ్యవసాయ కార్మికులకు జీవన భృతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కురాకుల బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

తుఫాను బాధితులకు సహాయం

లింగపాలెం: తుపాను బాధితులకు మండలంలోని నరసన్నపాలెం గ్రామ సర్పంచ్ కూరపాటి వెంకటేశ్వరరావు (రత్తయ్య) సహాయాన్ని అందించారు. గురువారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం రూ.50 వేలను రత్తయ్య అందజేశారు. ఈ సందర్భంగా రత్తయ్యను ఎమ్మెల్యే అభినందించారు.

ఏచూరి మరణం తీరని లోటు

కుక్కునూరు: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్యంతో గురువారం మృతిచెందడం బాధాకరమని ఆయన మృతి కార్మికవర్గానికి, బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. కామ్రేడ్ సీతారాం మృతికి సంతాపం తెలియజేస్తూ సాయికిరణ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఐ,ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు షేక్ గౌస్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఐతా సురేష్ సంతాపం తెలిపారు.
చింతలపూడి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి పట్ల జిల్లా పౌర హక్కుల సంఘం ఉపాధ్యక్షులు పిడపర్తి ముత్తారెడ్డి గురువారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని అన్నారు. సీతారామ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

బాలసదనం పరిశీలన

దెందులూరు: స్థానిక బాల సదనాన్ని ఐసీడీఎస్ నోడల్ అధికారి కె.స్వరాజ్యలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మరుగు దొడ్లు, బెడ్లు, విద్యుత్, తాగునీరు, నాలుగువైపులా ప్రహరీ, భవన పటిష్టతను పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. భోజన రుచి, నాణ్యతపై ఆరా తీశారు. వంట షెడ్డును పరిశీలించారు. స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాలసదనం విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మిషన్ వాత్సల్యంలో ఉన్న అన్ని ఐటమ్స్ సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాలో నిరాదరణకు గురైన బాలలను ఆదరించాలని సూపరింటెండెంట్ బేబీ సరోజినికి సూచించారు. ఆమె వెంట డీసీపీఓ డాక్టర్ సూర్యచక్రవేణి ఉన్నారు.

పెట్రోల్ బంక్‌కు స్థల పరిశీలన



పోతునూరులో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

దెందులూరు: మండలంలోని పోతునూరులో పెట్రోలు బంకు నిర్మాణానికి స్థలాన్ని ఆర్డీఓ షేక్ ఖాజావలీ, తహసీల్దార్ బి.సుమతి పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌ఓ బోదుల శ్రీనివాస్, స్థల యజమాని రాజా ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

భీమడోలు: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంఆర్సీలో గురువారం విద్యా విషయాక అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఎంఈఓ-1 శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ యూడైస్ ప్లస్, ఎండీఎం, పరీక్షల మూల్యాంకనం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలందర్నీ పాఠశాలల్లో చేర్పించాలని, బడికి దూరంగా ఉన్న వారిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. యూడైస్ ప్లస్‌లో పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి పక్కా సమాచారాన్ని పొందుపర్చాలని, ఆధార్ నెంబర్, వారి ఫోన్ నెంబర్ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు అందించాలని, పాడైన కోడిగుడ్లు, బరువు తక్కువ కోడిగుడ్లను తీసుకోవద్దని తెలిపారు. పాఠశాలల్లో శానిటేషన్ ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, ఇటీవల జరిగిన పరీక్షల మూల్యాంకనపు ఫలితాలను నమోదు చేయాలన్నారు. నవోదయ, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు రాసే వారి సంఖ్యను పెంచాలని తెలిపారు. యుడైస్ ప్లస్, స్కూల్ యాజమాన్య కమిటీ వివరాల ఆన్‌లైన్ చేసే విధానంపై హెచ్ఎం పాశం పాండురంగారావు టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్ఎం, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

తగ్గని ముంపు.. వీడని భయం

- పదకొండో రోజు జల దిగ్బంధంలోనే 33 గ్రామాలు
- బయటపడిన ఇళ్లు శుభ్రం చేసుకుంటున్న బాధితులు
- ఆదుకోవాలని వేడుకొంటున్న ముంపు బాధితులు.. అందని వరద సాయం



కుక్కునూరు: ఇంకా వరద ముంపులోనే ఉన్న పత్తిపంట

వేలేరుపాడు: గోదావరి శాంతించినా విలీన మండలాల్లో వరద ఉధృతి తగ్గలేదు. భద్రాచలం వద్ద గురువారం రాత్రి నీటి మట్టం 41.3 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. అయినప్పటికీ వేలేరుపాడు మండలంలో ముంపు వీడటం లేదు. పూర్తిగా వరద ప్రభావం తగ్గలేదు. బుధ, గురువారాల్లో వర్షాలు లేనప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద వలన శబరి, ఎగపోటు వణికిస్తోంది. దీనికి తోడు సీలేరు, తాలిపేరు నదుల వలన గోదావరి వరద తగ్గడం లేదు. దీంతో వేలేరుపాడు మండలంలో 33 గ్రామాలు పదకొండో రోజూ జల దిగ్బంధంలోనే ఉన్నాయి. మండలంలోని వేలేరుపాడు సంతబజారు, చాకలి బజారు, రుద్రమకోట, తిర్లాపురం, పాతనార్లవరం, టేకూరు, పూసుగొంది, పేరంటపల్లి, టేకుపల్లి, ఎడవల్లి, కాకిస్‌నూరు గ్రామాల్లో నీటమునిగిన ఇళ్లు గురువారం సాయంత్రం బయట పడ్డాయి. బురద నీరు పట్టిన ఇళ్లను బాధితులు శుభ్రం చేసుకుంటున్నారు. వేలేరుపాడు నుంచి రుద్రమకోట, రేపాకగొమ్ము వెళ్లే రహదారులు నీట మునిగే ఉన్నాయి. బుర్రతోగు వద్ద మేళ్లవాగు బయటపడటంతో కన్నాయిగుట్ట, చాగరపల్లి, కొర్రాజులగూడెం, గ్రామాలకు గురువారం సాయంత్రం నుంచి రాకపోకలు సాగుతున్నాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో మేళ్లవాగు, ఎద్దెలవాగు, టేకూరు వాగుల వంతెనలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపైనే ప్రయాణిస్తున్నారు.

శాంతించిన గోదావరి

కుక్కునూరు: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు తగ్గడంతో గోదావరి వరద శాంతించింది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. మరో పక్క శబరి నీటిమట్టం కూడా తగ్గడంతో గురువారం రహదారులు వరద నుంచి బయట పడ్డాయి. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ గ్రామాల్లో పంట చేలు మాత్రం ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. ఈ ఏడాది జూలై నుంచి గోదావరి నీటి మట్టం ఐదుసార్లు మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించగా, మూడుసార్లు రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. కేవలం ఒక్కసారి మాత్రమే మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. కాగా ఇంకా వరద పూర్తిగా తగ్గక పోవడంతో ముంపు గ్రామాల వరద బాధితులు ఇంకా పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. ప్రతీ ఏడాది గోదావరి వరదలతో సతమవుతున్న విలీన మండలాల నిర్వాసితులు ఇక ఈ బాధలు పడేలేమంటున్నారు. ప్రభుత్వం త్వరగా తమకు పోలవరం ప్యాకేజీ ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.



వేలేరుపాడు: ఇళ్లను శుభ్రం చేసుకుంటున్న సంతబజారు వాసులు



వేలేరుపాడు: పడవలపై రాకపోకలు సాగిస్తున్న ముంపు గ్రామాల ప్రజలు

ప్యాకేజీ ఇప్పించండి.. వెళ్లిపోతాం



ప్యాకేజీ ఇవ్వాలని ఎమ్మెల్యేకు మొర పెట్టుకుంటున్న రుద్రమకోట గ్రామస్తులు

వేలేరుపాడు: ప్రతీ ఏటా గోదావరి వరదలను మేం తట్టుకోలేకపోతున్నాం. ఆర్అండ్ఆర్ వ్యక్తిగత ప్యాకేజీతో పాటు, ఇంటి విలువల ప్యాకేజీ ఇప్పిస్తే, గ్రామాలు ఖాళీ చేసి వెళ్లిపోతామని గోదావరి వరద ప్రభావిత ప్రజలు వేడుకుంటున్నారు. గురువారం వేలేరుపాడు మండలంలోని రుద్రమకోట,రేపాకగొమ్ము, తిర్లాపురం గ్రామాల్లో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల నిర్వాసితులు గోదావరి వరదల్లో పడుతున్న కష్టాలపై తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ కష్టాలు పగోడికి కూడా రావొద్దని, తమకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి, పునరావాస కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ప్రధానంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ప్రభుత్వం విధించిన కట్ ఆఫ్ డేట్ జూన్ 5, 2017ను రద్దు చేసి, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ వ్యక్తిగత ప్యాకేజీ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డ్వామా పీడీ రాము, ఆర్డీవో అద్దయ్య, తహసీల్దార్లు చల్లన్నదొర, సత్యనారాయణ, ఎస్సై రామారావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమనుగు రవి కుమార్, మద్దు తేజ, తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించు వినాయకా..!

- కొనసాగుతున్న ఉత్సవాలు
- పలుచోట్ల నిమజ్జనాలు



చింతలపూడి: పట్టణంలో ట్రాక్టర్‌పై ఊరేగుతున్న గణ నాథుడు



ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడి ఆలయంలో గణేషుడికి పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం



లింగపాలెం: కె.గోకవరం చిన్న రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గణేష్ నవ రాత్రి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. విఘ్నాలు తొలగించుమయా.. గణనాయకా అంటూ భక్తులు గణేష్ ఉత్సవాలను కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో కొలువైన గణేషుడికి అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం గణనాథుడికి పూజాధికాలు జరిపి, నివేదనలను సమర్పించారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో గణేషుడిని నెలకొల్పిన కమిటీ సభ్యులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.
లింగపాలెం: మండలంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కె.గోకవరం చిన్న రామాలయం సెంటర్ లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మొగళ్ల నాగరాజు, మొగళ్ల శ్రీను, గజ్జల అరుణ్ కుమార్, పండూరి వెంకటేశ్వర రావు, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

బైబై వినాయకా

కొయ్యలగూడెం: గణేష్ ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా అన్న సమారాధనలు, ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి లడ్డూలను యువకులు వేలంలో అధిక ధరకు దక్కించుకున్నారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, రాజవరం, బయ్యన్నగూడెం, పొంగుటూరు, గవరవరం గ్రామాలలో గణేష్ ఉత్సవాలు ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.
వేలేరుపాడు: వినాయకుడి నిమజ్జనోత్సవ సందర్భంగా వేలేరుపాడు మండల కేంద్రంలో దర్శన మిచ్చిన విచిత్రాలివి. ఊళ్లోకొచ్చిన గోదావరి వరదలో భక్తులు నిమజ్జనం చేసిన వినాయకుడు గోదారమ్మకే బైబై చెబుతూ బయటికి తేలగా, మరో వైపు పడవపై నిమజ్జనానికి బయల్దేరిన మరో బొజ్జగణపయ్య గోదావరి వరద వేలేరుపాడు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉండటంతో శివకాశీపురం గ్రామానికి చెందిన భక్తులు ఈ ప్రాంతంలో బుధవారం సాయంత్రం గోదావరి వరద నీటిలో నిమజ్జనం చేశారు. గోదావరిలో వినాయకుడి విగ్రహం నీటిలో కరగకుండా కొంత దూరం వెళ్లి అక్కడే ఉండిపోయింది.
పోలవరం రూరల్: మండలంలో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. పట్టిసం గ్రామంలోని గోదావరి నది ఒడ్డున నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గోదావరి వరద ఉధృతంగా ఉన్న దృష్ట్యా నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ అధికారులు గట్టి బందోబస్తు నిర్వహించారు.
చింతలపూడి: చింతలపూడి మండలంలోని పలు ప్రాంతాలతో పాటు, పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహాలను భక్తులు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు జలాశయంలో గణనాధుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు.

పోలీసుల ముందు జాగ్రత్త

గణేష్ నిమజ్జనాల సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు. మండలంలో గుర్తించిన స్థలాల్లోనే విగ్రహాల నిమజ్జనం చేపట్టినట్లు చెప్పారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో యువకులు తగిన జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.



కొయ్యలగూడెం: బాల గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం



వేలేరుపాడు: పడవపై నిమజ్జనానికి వెళుతున్న భక్తులు



పోలవరం రూరల్: గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం



క్రీడలు ప్రారంభిస్తున్న ఎంఈవో

లింగపాలెం: విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతోగానో దోహద పడతాయని లింగపాలెం మండల విద్యాశాఖాధికారి కంఠ రామారావు అన్నారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం శింగగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల పోటీలను గురువారం రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండల స్థాయి ఆటలు పోటీలు మూడు రోజులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకురాలు నళిని, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.అలివేలు మంగతాయారు, మండలం గేమ్స్ సమన్వయ అధికారి పీహెచ్ వి.ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యాయులు టి.ప్రభాకరరావు, పీడీలు వి.శ్యామల, ఎం.లక్ష్మి, ఎ.కామేశ్వర రావు, బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్, పీడీ ఎల్.జయరాజు మాట్లాడుతూ అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో వివిధ అంశాల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. రెండు రోజులు నిర్వహించే ఎంపికల్లో భాగంగా గురువారం అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్, బాడ్మింటన్ పోటీల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీ

దెందులూరు: రైస్‌మిల్లు నిర్వహణ సక్రమంగా ఉండాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం కొవ్వలిలో విజయలక్ష్మి రైస్‌మిల్లులో ఆమె తనిఖీ నిర్వహించారు. మిల్లులో స్టాక్, రిజిష్టర్లను పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌ఓలు రామకృష్ణ, కిషోర్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

గణపవరం: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తే ఉద్యమం తప్పదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. గురువారం గణపవరం మండలం పిప్పరలో మెంటయ్య అధ్యక్షతన నిర్వహించిన మాలమహానాడు మండల సమావేశంలో మంగరాజు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని 2004లో ఐదుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పునిచ్చిందని, ఇప్పుడు అదే సుప్రీం కోర్టు వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చని తీర్పు చెప్పడం దారుణమని పేర్కొన్నా రు. ధర్మాసనంలోని ద్వివేది అనే సభ్యుడు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. మందకృష్ణ మాదిగ మాలలను దోపిడి దారులుగా, దొంగలుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు సోడదాసి జైపాల్, బి.శివరావు, స్నేహ ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

ఐరన్ మాత్రల పంపిణీ

గణపవరం: విద్యార్థులు రక్తహీనత కలిగి ఉంటే చదువులో వెనుకబాటుకు గురవుతారని, అందువల్ల ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని గణపవరం మండలం కాశిపాడు జెడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. రక్తహీనత రాకుండా ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ, వేరుశెనగబెల్లం చిక్కీలను అందిస్తుందని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

గణపవరం: వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం గణపవరంలో వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కలిశెట్టి వెంకట్రావు, సీతారాం ప్రసాద్, టి.శ్రీనివాస్, పల్లిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం



చిలుకూరి జ్ఞానారెడ్డి

చింతలపూడి: విజయవాడ వరద సహాయక చర్యల్లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి అన్నారు. గురువారం చింతలపూడిలో మాట్లాడుతూ వరదలపై ముందస్తు సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఫలితంగా సుమారు 60 మంది వరదల్లో మునిగి చనిపోయారని చెప్పారు. విజయవాడ వరదల్లో చిక్కుకొని సహాయం కోసం ఎదురు చూస్తున్న ప్రజలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వారానికి పైగా తాగునీరు, ఆహారం కోసం బాధితులు అలమటించిపోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా ఉండటానికి బుడమేరు వరద నీటిని పట్టణం వైపు విడిచి పెట్టారని చెప్పారు. విజయవాడ వరద పరిస్థితికి చంద్రబాబే బాధ్యత వహించాలన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు నష్టం కలగకుండా చూసుకున్నారని గుర్తు చేశారు. వాలంటీర్ వ్యవస్థ ఉండి ఉంటే విజయవాడ వరదల్లో ప్రజలు ఇబ్బందులు పడేవారు కాదన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కొయ్యలగూడెం: పౌష్టికాహార మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొయ్యలగూడెం: పొంగుటూరు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కుంతలగూడెంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహారం, పిల్లల పోషణపై అవగాహన కల్పించారు. పోషణ లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వం తక్కువ ఖర్చుతో అందజేస్తున్న పోషకాహారాన్ని పొంది ఆరోగ్య సమాజాన్ని నెలకొల్పాలన్నారు. పులి నాగరత్నం, అబ్బు సుబ్రహ్మణ్యం , ఎంపీటీసీ తేలే శ్రీనివాస్, గన్నిమని రత్నాజీ, భవానీ, ధనలక్ష్మి, శాలిని, నాగరత్నం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.
జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహార మహోత్సవాలు కొనసాగుతున్నాయి. జంగారెడ్డిగూడెంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా ఆధ్వర్యంలో పోషకాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, పదం కో-ఆర్డినేటర్ కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు యు.ఝాన్సీ, డి.ధనమ్మ, మాధురి, తల్లులు, ప్రీ స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.